నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

3 | కరీంనగర్, శనివారం 24 ఫిబ్రవరి 2024 | RAJANNA SIRCILLA














వీణవంక: సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



గంగాధర : బూరుగుపల్లిలో సమ్మక్క తల్లికి మొక్కుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రేకుర్తి సమ్మక్క జాతరకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు

# తల్లులకు నీరా‘జనం’

## ఇసుకేస్తే రాలనంతగా వనదేవతల జాతరలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోటెత్తిన భక్తులు
- సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం బారులు
- కేశవపట్నం, రేకుర్తి, గోదావరిఖని, నీరుకుళ్లలో దర్శనానికి గంటల కొద్దీ సమయం
- నిలువెత్తు బంగారంతో మొక్కులు
- నేడు వనంలోకి తల్లులు

**సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వెల్లువలా తరలివచ్చి, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడి మరీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ‘సల్లంగ సూడు తల్లీ’ అంటూ వనదేవతలను వేడుకున్నారు.**

కరీంనగర్ కమాన్ చౌరస్తా/ సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23 : గద్దెలపై సమ్మక్క, సారలమ్మ కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు వెల్లువలా తరలివచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 50 చోట్లకుపైగా జాతరలు జరగ్గా, లక్షలాది మంది దర్శించుకున్నారు. రేకుర్తి, కేశవపట్నంతోపాటు గోదావరిఖని, నీరుకుల్ల, కొలనూర్, వీణవంకలో గంటల తరబడి క్యూలో వేచి ఉండి మరీ తల్లులను దర్శించుకున్నారు. అంతటా ఉదయం నుంచి రాత్రి దాకా అమ్మవార్ల సేవలో తరించారు. వనదేవతలకు ఒడిబియ్యం, చీర, పసుపు, కుంకుమ, బంగారం (బెల్లం) సమర్పించి, పిల్లాపాప, గొడ్డు గోదను చల్లంగా చూడాలని వేడుకున్నారు. జాతర ప్రాంతాల్లో ఎదురుకోళ్లు, గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడే వంటలు చేసుకొని, సామూహిక భోజనాలు చేసి, తిరుగుపయనమయ్యారు.



రేకుర్తి రోడ్డులో నిలిచిన వాహనాలు

### దర్శించుకున్న ప్రముఖులు

వీణవంక మినీ మేడారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోగా, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. హుజూరాబాద్‌లోని రంగనాయకుల గుట్ట, జూపాకలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో.., గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావుతో కలిసి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి, ధర్మారంలో విప్ అడ్లూరి లక్ష్మణ్, సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో ఎమ్మెల్యే విజయరమణారావు, గంగాధర మండలంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పెద్దపల్లి, ఓదెల మండలాల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అమ్మవార్ల కు మొక్కులు చెల్లించుకున్నారు. కోనరావుపేట మండలం శివంగాళపల్లిలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ వేములవాడ ని యోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పూజలు చేశారు.



ఫర్టిలైజర్‌సిటీ: గోదావరి తీరంలోని జనగాం వద్ద అమ్మవార్ల గద్దెల వద్ద భక్తజనం

### సెల్ చార్జింగ్ @ రూ.20



సెల్‌ఫోన్ ఒక నిమిషం స్విచ్ఛాఫ్ అయినా ఆగమాగమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని సమ్మక్క జాతరల్లో భక్తుల కోసం సెల్ చార్జింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్నారు. ఓదెల మండలం కొలనూర్ జాతరలో వచ్చిన భక్తులకు సెల్‌ఫోన్ చార్జింగ్ కోసం ప్రత్యేకంగా షాపులు ఏర్పాటు చేశారు. రూ.20 చెల్లిస్తే ఫుల్ చార్జింగ్ చేసి ఇచ్చారు.

**-ఓదెల, ఫిబ్రవరి 23**



ఓదెల: భక్తులతో కిటకిటలాడుతున్న కొలనూర్ జాతర ప్రాంగణం



ఫర్టిలైజర్‌సిటీ: బుట్ట బంగారంతో భక్తులు





శంకరపట్నం: కేశవపట్నం సమ్మక్క గద్దెల వద్ద భక్తులు

## జగిత్యాల టౌన్ సీఐ నటేశ్ సస్పెన్షన్

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23: కొన్నేండ్లుగా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ వివాదాలకు కేంద్రబిందువుగా మారిన జగిత్యాల టౌన్ సీఐ నటేశ్‌పై సస్పెన్షన్ వేటు పడ్డది. మల్టీజోన్ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. గతంలో కరీంనగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలోనూ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాడు. జగిత్యాలకు బదిలీపై వచ్చిన తర్వాత కూడా ఆయనపై అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. కరీంనగర్‌లో పనిచేసినప్పుడు భూవివాదాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేయడం, వివిధ నేరాల్లో బాధితుల తరుపున కాకుండా బాధ్యులకే వత్తాసు పలికేవాడని ఆరోపణలు ఉన్నాయి. జగిత్యాలకు వచ్చిన తర్వాత ధర్మపురి రోడ్‌లోని విదేశీ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ నిరుద్యోగులను మోసం చేసిన కేసులో కన్సల్టెన్సీకి వత్తాసుపలికాడని బాధితులు డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. అదేవిధంగా విదేశీ మ్యాన్‌పవర్ కంపెనీలు, ట్రావెల్స్‌లపై దాడుల్లో భాగంగా అన్ని అనుమతి పత్రాలు ఉన్నప్పటికీ స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్టులు, ఇతర పత్రాలను తిరిగి ఇచ్చే క్రమంలో భారీగా డబ్బులు డిమాండ్ చేశాడని ఇద్దరు మాట్లాడుకున్న వాయిస్ రికార్డు జిల్లాలో అప్పట్లో వైరల్ అయ్యింది. జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై ఓ వ్యక్తి ఇటీవల దాడి చేస్తే సీఐ నటేశ్ పట్టించుకోలేదని, ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల డీఎస్పీ దగ్గరుండి మరీ కేసు నమోదు చేయించారు. ఇలా అనేక వివాదాల్లో చిక్కుకున్న సీఐ నటేశ్‌ను ప్రభుత్వం గత జనవరి 12న బదిలీ చేసింది. అయితే వారం రోజుల్లోనే క్యాన్సల్ చేసింది. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గే ప్రభుత్వం బదిలీ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిసింది.

# అంజన్న ఆదాయానికే ఎసరు



- కొండగట్టులో వెలుగులోకి నయా బాగోతం
- షాపుల లీజు వసూళ్లలో ₹37.90 లక్షలు స్వాహా
- రికార్డుల పరిశీలనలో గుర్తించిన అధికారులు
- తాజాగా సదరు ఉద్యోగికి మెమో
- వ్యవహారంపై అనేక అనుమానాలు

**కొండగట్టు అంజన్న ఆదాయానికి ఓ ఉద్యోగే ఎసరుపెట్టాడు. షాపుల లీజుకు సంబంధించి వ్యాపారులు చెల్లించిన ₹37.90 లక్షలు స్వాహా చేశాడు. రెండు రోజుల క్రితం రికార్డుల పరిశీలనలో భాగంగా ఉన్నతాధికారులు గుర్తించి, సదరు ఉద్యోగికి మెమో ఇవ్వడంతో అసలు బాగోతం వెలుగుచూసింది. అయితే ఈ వ్యవహారంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2023-24కి సంబంధించి లీజుల గడువు ముగిసినా ఎందుకు గుర్తించలేకపోయారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**

మల్యాల, ఫిబ్రవరి 23: కొండగట్టు అంజన్న దుకాణాల లీజుకు సంబంధించి గతేడాది జనవరిలో వేలంపాట నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి31 వరకు దుకాణాల హక్కులు దక్కించుకున్న వ్యాపారులు, విడతల వారీగా చెల్లింపులు జరుపుతుంటారు. కొబ్బరికాయల విక్రయదారులకు ఆలయ ఆవరణలో పులి మల్లేశం ₹31.80లక్షలు, పూలు, పండ్లు విక్రయించే సుధగోని చిరంజీవి ₹3లక్షలు, కిరాణాషాపు నిర్వాహకుడు సుధగోని శ్రీధర్ ₹60వేలు, హోటల్ యజమాని జలంధర్ ₹50వేలు, సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకుడు నవీన్‌కుమార్ ₹2లక్షలు ఆలయంలో పని చేసే టెండర్ సెక్షన్ ఇన్‌చార్జికి చెల్లించి చేసి రసీదులు పొందారు. కానీ, సదరు ఉద్యోగి ఆ నగదును డీసీబీ (డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్) బుక్‌లో రాసినప్పటికీ.. ఆలయ పరిధిలో గానీ, బ్యాంక్‌లో గానీ జమ చేయలేదు. అలాగే వ్యాపారులకు నో డ్యూ ఇవ్వకుండా.. రసీదు ఇచ్చి సరిపెట్టినట్టు తెలుస్తున్నది. ఈ చెల్లింపుల వివరాలను డీసీబీ బుక్‌లో రాసిన తర్వాత మరో ఉద్యోగి క్యాష్ బుక్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. అదీ జరగలేదని తెలుస్తున్నది. టెండర్ గడువు పూర్తయ్యే సమయానికైనా దీనిని గుర్తించి.. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సమాచారం ఇచ్చారా..? లేదా..? అన్నది కూడా తెలియదు.

### స్వాహా బట్టబయలు.. మెమో జారీ

రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలించిన సమయంలో ₹37.90లక్షల స్వాహా బాగోతం బట్టబయలైంది. దీంతో అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. కాగా, సదరు ఉద్యోగికి ఆలయ ఈవో టంకశాల వెంకటేశం శుక్రవారం మెమో జారీ చేశారు. అయితే స్వాహా వ్యవహారంలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి ఇదివరకు దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు మళ్లీ టెండర్ ప్రక్రియలో పాల్గొనాలంటే.. ఆలయ అధికారుల నుంచి తీసుకున్న నో డ్యూ సమర్పించాల్సి ఉంటుంది. గత జనవరిలో 2024-25కి సంబంధించి టెండర్లు నిర్వహించినప్పుడు నోడ్యూ సర్టిఫికెట్లు లేకపోవడాన్ని ఎవరూ గుర్తించకపోవడం సందేహాలకు తావిస్తున్నది. నగదు వివరాలను క్యాష్ బుక్‌లో నమోదు చేసే ఉద్యోగితోపాటు సెక్షన్ పర్యవేక్షకుడు సైతం లీజుల వసూలును ఎందుకు గుర్తించలేదనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అందులో ఇతర అధికారుల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మరెన్నో అనుమానాలు

ఆలయ అవసరాల కోసం ఇతర ఆలయాల నుంచి ఉద్యోగులను డిప్యూటేషన్ పద్ధతిన తీసుకువచ్చినా.. ఐదేళ్లకు మించి ఉండరాదనే నిబంధన ఉన్నది. కానీ, అంజన్న ఆలయంలో ఆ నిబంధనలు బేఖాతరు అవుతున్నట్టు తెలుస్తున్నది. కొందరు ఐదేళ్లు దాటినా ఇక్కడే ఉంటూ.. కీలక బాధ్యతలను వారి గుప్పిట్లో ఉంచుకొని చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తున్నది. ఆదాయ-వ్యయాలకు సంబంధించి వార్షిక ఆడిట్‌ను నిర్వహించకపోవడం వల్ల స్వాహా వ్యవహారాలను గుర్తించడం లేదనే విమర్శలున్నాయి. గతంలో ఓసారి ఆడిట్ చేసినప్పుడు లక్షలాది రూపాయలు సిబ్బంది పక్కదారి పట్టించినట్టు తేలింది. అప్పుడు కొంతమంది తిరిగి చెల్లింపులు చేశారు. రెండేళ్ల నుంచి ఆడిట్ పెండింగ్‌లో ఉండగా, కొంత మంది తమకు ఏమి కాదనే ఉద్దేశ్యంతో ఆలయ పద్దులను సొంతానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఈవో మెమో జారీ చేయడంతో అవి బలపడుతున్నాయి. అంజన్న ఆలయ లీజులు వసూలు నుంచి ₹37.90 లక్షలు స్వాహా చేసిన ఘటన వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ స్థాయిలో ఓ ప్రత్యేకాధికారిని నియమించి విచారణ చేపడితేనే పూర్తి స్థాయి విషయాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి.

### అవినీతిని ఉపేక్షించేది లేదు



అంజన్న ఆలయ ప్రాంగణంలో ఉద్యోగుల అవినీతిని ఉపేక్షించేది లేదు. ₹37.90 లక్షల స్వాహా విషయంలో సదరు ఉద్యోగికి మెమో జారీ చేశాం. ఆలయ నగదును తిరిగి వసూలు చేస్తాం. పద్దు పుస్తకాలను పరిశీలించాక దేవాదాయ కమిషనర్‌కు నివేదించి తగిన చర్యలు తీసుకుంటాం.

**- టంకశాల వెంకటేశం, ఆలయ ఈవో (కొండగట్టు)**

## మార్చిలో వస్తానని.. అంతలోనే ఆగిన గుండె

- గుండెపోటుతో బహ్రెయిన్‌లో బొప్పాపూర్‌వాసి మృతి



రాజు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23: వచ్చే నెలలో ఇంటికి వచ్చేందుకు సిద్ధమవుతున్న ఆ వలసజీవి గుండె మధ్యలోనే ఆగిపోయింది. పెద్దదిక్కు రాక కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ కుటుంబం విషాదంలో మునిగింది. వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన నిమ్మల రాజు (45)కు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఉపాధి కోసం రాజు పదేండ్లుగా బహ్రెయిన్‌కు వెళ్లొస్తున్నాడు. అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడేండ్ల క్రితం ఇంటికి వచ్చి తిరిగి వెళ్లాడు. మూడు, నాలుగు రోజుల క్రితమే ఇంటికి ఫోన్ చేసి మాట్లాడాడు. కంపెనీకి లెటర్ రాశానని, మార్చిలో వస్తానని సంతోషంగా చెప్పాడు. కానీ, అంతలోనే ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం మధ్యాహ్నం రూం నుంచి డ్యూటీకి వెళ్లే క్రమంలో ఛాతిలో నొప్పితో తల్లడిల్లిపోయాడు. అదే రూంలో ఉన్న స్నేహితులు రాజును దవాఖానకు తరలించే క్రమంలోనే చనిపోయాడు. ఈ విషయం తెలియడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ‘మా కోసం ఎన్నో ఏండ్ల సంది దేశం పోతున్నవ్. వచ్చే నెలలో ఇంటికి వస్తానని మొన్న సంతోషంగా చెప్పినవ్. పిల్లలకు ఏం కావాలో చెప్పు అని రాసుకుంటివి’ అని గుర్తు చేసుకుంటూ ఆ భార్య కన్నీరుమున్నీరైంది. ‘దేవుడా.. ఎందికిట్ల చేసినవయ్యా’ అంటూ గుండెలవిసేలా రోదించింది.